విద్యార్థుల ఉత్తీర్ణత పదిలమేనా?



- తొలిసారి బోర్డు పరీక్షతో విద్యార్థులపై ఒత్తిడి
- విద్యా సంవత్సరం ముగింపు దశలో టీచర్ల బదిలీ ప్రక్రియతో పెను ప్రభావం
- 45 రోజుల్లో వార్షిక పరీక్ష ఉండటంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఆందోళన

సాక్షి, మేడ్చల్ జిల్లా: విద్యార్థి దశలో పదో తరగతి అత్యంత కీలకమైంది. తొలిసారి బోర్డు పరీక్షలను ఎదుర్కోవాల్సి రావడంతో విద్యార్థులు అదే స్థాయిలో ఒత్తిడికి గురవుతున్నారు. ఉన్నత చదువులతో పాటు భవిష్యత్తులోనూ పదో తరగతి మార్కులను ప్రామాణికంగా తీసుకుంటారన్న విషయం తెలిసిందే. ఈ విద్యా సంవత్సరం ముగింపు దశకు వచ్చిన తరుణంలో ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ విద్యార్థుల చదువులపై ప్రభావం చూపేలా ఉంది. కాగా మరో 45 రోజుల్లో వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి.

గ్రేటర్ సహా శివారు జిల్లాల్లో 1.54 లక్షల విద్యార్థులు

గ్రేటర్ హైదరాబాద్‌తో సహా శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలలో 1.54 లక్షల మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. ప్రస్తుతం విద్యా సంవత్సరం తుది దశకు చేరుకుంది. ఈ దశలో అనూహ్యంగా బదిలీల షెడ్యూలు విడుదల కావడంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.

విద్యార్థులకు భారంగా బదిలీ ప్రక్రియ...

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 1863 మంది ఉపాధ్యాయులు బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. 317 జీవో ద్వారా వచ్చిన వారికి అవకాశం కల్పించడంతో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ఇదే బదిలీల పర్వం హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో కూడా ఉంది. ఈ అంశాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతనెల 27 నుంచి బదిలీలు, ఉద్యోగోన్నతుల షెడ్యూల్ అమలోకి వచ్చింది. మారిన షెడ్యూల్ ప్రకారం.. ఈ ప్రక్రియ మార్చి చివరి వరకు కొనసాగనుంది. ఇంకో పక్క విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపుతో పాటు పదో తరగతి వార్షిక పరీక్షలో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ తరుణంలో బదిలీల ప్రక్రియ విద్యార్థులకు భారంగా మారనుంది. బదిలీలకు సంబంధించి ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించాల్సి ఉన్నా దరఖాస్తు చేసేందుకు, ధ్రువపత్రాల పరిశీలన, అభ్యంతరాల పేరిట పలుమార్లు జిల్లా కేంద్రానికి తిరగాల్సి రావడం సమస్యగా మారిందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

ఆగిన బోధనోపకరణాల మేళా...

ఏప్రిల్ 3వ తేదీ నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పాఠ్యాంశాలకు సంబంధించి సిలబస్ చాలా చోట్ల ఇప్పటికే పూర్తయింది. ప్రస్తుతం పునఃశ్చరణ చేపట్టాల్సిన తరుణంలో ఉపాధ్యాయుల బదిలీపై శ్రద్ధ పెడితే పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన మెలకువలపై పట్టు తప్పే పరిస్థితి ఉంది. ప్రత్యేక తరగతులతో పాటు వెనుకబడిన విద్యార్థులపై ఆయా పాఠ్యాంశాలకు సంబంధించి శ్రద్ధ తీసుకోవాలి. ఇంకో పక్క తొలి మెట్టులో భాగంగా ఉపాధ్యాయుల బోధనకు పదును పెట్టేలా వారి ప్రతిభను వెలికి తీసేందుకు ప్రవేశపెట్టిన బోధనోపకరణాల మేళా బదిలీల షెడ్యూల్ కారణంగా ఆగిపోయింది. మండల స్థాయిలో మేళా విజయవంతమైంది.

ఆన్‌లైన్ ద్వారానే ప్రక్రియ పూర్తి చేయాలి

ఉపాధ్యాయులు బదిలీల ప్రక్రియను ఆన్‌లైన్ ద్వారానే పూర్తి చేయాలని ఆదేశించాం. పదో తరగతి విద్యార్థులపై ఈ ప్రభావం ఉండదు. దరఖాస్తులకు సంబంధించి కూడా పాఠశాల పని వేళలు ముగిసిన తర్వాతే కార్యాలయానికి రావాలని సూచించాం. పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ముందుకు సాగుతున్నాం.

– ఐ.విజయకుమారి, జిల్లా డీఈఓ

చకచకా రోడ్డు పనులను పూర్తి చేయండి

మేడిపల్లి: వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నాలుగు లేన్ల రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి అధికారులకు సూచించారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్యాలయంలో ఆయన సోమవారం సమావేశం నిర్వహించారు. నాలుగు లైన్ల రోడ్డు పనుల్లో ఎలాంటి ఇబ్బంది కలగకుండా త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌ను ఆయన ఆదేశించారు. రోడ్డు విస్తరణలో స్థలాలు కోల్పోతున్న వారికి ప్రభుత్వం టీడీఆర్ బాండ్స్ అందించడంలో అలసత్వం వహిస్తున్న అధికారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బాండ్స్‌ను త్వరగా అందజేయాలని అన్నారు. రోడ్డు విస్తరణ సమయంలో అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను మార్చే పనులను విద్యుత్ అధికారులు త్వరగా పూర్తి చేయాలన్నారు. సీసీ, తాగునీటి పైప్‌లైన్లను తొలగించి వాటి స్థానంలో ఎక్కువ సామర్థ్యం కలిగిన పైప్‌లైన్లను వేయాల్సిందిగా జలమండలి అధికారులను కోరారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు బొడిగె రాందాస్‌గౌడ్, మాడుగుల చంద్రారెడ్డి, బొడిగె కృష్ణగౌడ్, ఈశ్వర్‌రెడ్డి, డీఈఈ శ్రీనివాస్, టీపీఎస్ రాజీవ్‌రెడ్డి, మేనేజర్ జ్యోతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం మేయర్ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు.


అధికారులతో మాట్లాడుతున్న మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి

ఆకస్మిక తనిఖీ



ఉప్పల్: చిలుకానగర్ డివిజన్‌లోని ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా వైద్యాధికారి డా.పుట్ట శ్రీనివాస్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కంటి వెలుగు శిబిరం నిర్వహణ, పరికరాలు, కంటి అద్దాల లభ్యత తదితర అంశాలను ఆయన పరిశీలించారు. అనంతరం సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో డా.సౌందర్యలత, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

కరెంటు ఉండని ప్రాంతాలు

ఉప్పల్: ఉప్పల్ పరిధిలోని 11కేవీ కళ్యాణపురి ఫీడర్, 33కేవీ ఎన్‌జీఆర్ఐ ఫీడర్ పరిధిలో మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంటు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ తెలిపారు. కళ్యాణపురి, ఈస్ట్ కళ్యాణపురి, నార్త్ కళ్యాణపురి, రాఘవేంద్రానగర్, బాలాజీ ఎన్‌క్లేవ్, టీచర్స్ కాలనీ, అజమత్‌నగర్ తదితర ప్రాంతాల్లో కరెంటు ఉండదన్నారు. 33/11కేవీ ఉప్పల్ బగాయత్ కాలనీ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు హెచ్ఎండీఏ లేఅవుట్ బాగాయత్‌లో కరెంటు ఉండదన్నారు.

మౌలాలి సబ్‌స్టేషన్ పరిధిలో..

కుషాయిగూడ: మౌలాలి సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం పలు ఫీడర్ల పరిధిలో కరెంటు ఉండదని ఏఈ తెలిపారు. గాయత్రినగర్ ఫీడర్ పరిధిలోని ఓల్డ్‌మౌలాలి, సాధుల్లానగర్, చందన్‌బాగ్, ఆనంద్‌నగర్ పార్కు, జనప్రియ, ఎస్‌పీ నగర్, పటేల్‌నగర్, గ్రీన్‌హిల్స్‌కాలనీ, అంబానగర్ కాలనీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కరెంటు ఉండదు.

ఏఎస్‌రావునగర్ పరిధిలో..

కుషాయిగూడ సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ అర్చన తెలిపారు. మహేష్‌నగర్ ఫీడర్ పరిధిలోని మహేష్‌నగర్ పరివార్ వెనుకభాగం, అరుణ ఆస్పత్రి, రాధిక వాటర్ సెక్షన్, మహేష్‌నగర్, రాధిక మెయిన్‌రోడ్డు, రాఘవేంద్ర ఆస్పత్రి లేన్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, ఏఎస్‌రావునగర్ ఫీడర్ పరిధిలోని ఎల్ఐజీ, ఎంఐజీ, హెచ్ఐజీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కరెంటు ఉండదు.

హామీల అమలులో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలం


ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నేతలు

బోడుప్పల్: హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం 5వ డివిజన్‌లో నిర్వహించిన హాత్ సే హాత్ జోడో యాత్రకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐఐసిటీ కాలనీ, ఎన్ఐఎన్ కాలనీ, వినాయకనగర్, భీంరెడ్డినగర్ కాలనీల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నట్లు వెల్లడించారు. కాలనీవాసులకు కరపత్రాలను పంపిణీ చేసి రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. కార్పొరేటర్లు పోగుల నర్సింహారెడ్డి, తోటకూర అజయ్ యాదవ్, బొమ్మక్ కళ్యాణ్‌కుమార్, పార్టీ ప్రధాన కార్యదర్శి కొత్త ప్రభాకర్‌గౌడ్, మేడ్చల్ నియోజకవర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త ప్రభాకర్‌గౌడ్, పార్టీ నేతలు సింగిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సింగిరెడ్డి రాజిరెడ్డి, హరినాథ్‌రెడ్డి, కందుకూరి నవీన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే అభివృద్ధి

రామంతాపూర్: రామంతాపూర్ వార్డు కార్యాలయం నుంచి మొదలుకొని డివిజన్‌లోని వివిధ బస్తీలు, కాలనీల్లో కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఏ–బ్లాక్ అధ్యక్షుడు మందముల్ల పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం జోడో యాత్ర జోరుగా కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామంతాపూర్ డివిజన్ పరిధిలో కాంగ్రెస్ పాలనలోనే చేసిన అభివృద్ధి పనులే కనిపిస్తున్నాయి తప్పా బీఆర్‌ఎస్, బీజేపీ పాలనలో అభివృద్ధి పనులు జరగలేదన్నారు. టీపీసీసీ ప్రతినిధి మేకల శివారెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నేతలు కంది ఆగిరెడ్డి, గిరిబాబు, రఫీక్, మురళీగౌడ్, అరుణ్, శ్రీనివాస్ యాదవ్, శంకర్ పాల్గొన్నారు.

రాగిడి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో..

రామంతాపూర్ రాజీవ్‌గాంధీ విగ్రహం నుంచి డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నియోజకవర్గ సీనియర్ కాంగ్రెస్ నేత రాగిడి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం జోడో యాత్ర కొనసాగింది. కాంగ్రెస్ నేతలు ఆగిరెడ్డి, మల్లిఖార్జున్‌గౌడ్, అంజయ్య, సుధాకర్‌శెట్టి, అనిల్, సుదర్శన్, సద్గుణరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై వెంటనే స్పందించాలి


ఉప్పల్‌లో వినియోగదారుల సమస్యలు వింటున్న ట్రాన్స్‌కో సీజీఎం జయరాజ్

ఉప్పల్: విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాలకు వచ్చే వినియోగదారులతో మర్యాదగా మాట్లాడి వారి సమస్యలకు పరిష్కారం చూపాలని ట్రాన్స్‌కో సీజీఎం ఎన్.జయరాజ్ అధికారులకు సూచించారు. విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఉప్పల్ ఎస్ఈ కార్యాలయ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని పలు ప్రాంతాల్లోని సమస్యలను ఆయన స్వయంగా తెలుసుకుని పరిష్కరించారు. మరి కొన్నింటిని త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దాదాపు 15 వరకు ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో టెక్నికల్ సభ్యులు బి.లలిత, శోభారాణి, హబ్సిగూడ డీఈ, ఉప్పల్ ఏడీఈ బాలకృష్ణ, ఏఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బంజారా భవన్‌కు స్థలం కేటాయించాలని వినతి

మేడిపల్లి: మేడిపల్లిలో బంజారా భవన్, కమ్యూనిటీ హాల్ నిర్మాణాలకు స్థలాలు కేటాయించాలని కోరుతూ మంత్రి మల్లారెడ్డిని ఆయన నివాసంలో సోమవారం కలిసిన కార్పొరేటర్లు సుభాష్ నాయక్, సుమన్ నాయక్ వినతి పత్రం అందజేశారు. ఈ నెల 15వ తేదీన సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహించినందుకు మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. మేడిపల్లి పరిధిలో బంజారా భవన్, కమ్యూనిటీ హాల్ నిర్మాణాలకు స్థలం కేటాయించాలని కోరారు. బంజారా భవన్‌కు స్థలం కేటాయించాల్సిందిగా జిల్లా కలెక్టర్‌కు లేఖ రాసినట్లు మంత్రి తెలిపారు.


మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్లు సుభాష్ నాయక్, సుమన్ నాయక్

అన్నదానం మహాదానం

కుషాయిగూడ: అన్నదానం మహాదానమని బీఆర్‌ఎస్ సీనియర్ నేత బండారి లక్ష్మారెడ్డి అన్నారు. అమావాస్య సందర్భంగా సోమవారం ఈసీఐఎల్‌లోని సాయిబాబా ఆలయం వద్ద వాసవి మిత్రమండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అమావాస్య రోజు అన్నదానం చేస్తున్న వాసవి మిత్రమండలి ప్రతినిధులను ఆయన అభినందించారు. వాసవి మిత్రమండలి ప్రతినిధులు పెద్ది నాగరాజు గుప్త, రెబెలి శ్రీనివాస్‌గుప్త, తిరుమలేశ్‌గుప్త, గంప కృష్ణ, ఉప్పల శ్రీనివాస్, భగవాన్, సిద్దిపేట శ్రీనివాస్, సంతోష్, నవీన్, అశోక్, శ్రీనివాస్ బీఆర్‌ఎస్ నేత నేమూరి మహేష్‌గౌడ్, జంపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరిలో..

మల్కాజిగిరి: అన్నపూర్ణ అమావాస్య అన్నదాన మిత్ర మండలి ఆధ్వర్యంలో సోమవారం పేదలకు మల్కాజిగిరిలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సురేష్, చంద్రశేఖర్, బీవైఎస్‌గుప్త, నాగేశ్వరరావు, పూర్ణచందర్, రాజ్‌కుమార్, వి.శ్రీనివాస్, డి.శ్రీనివాస్, బాలచందర్ తదితరులు పాల్గొన్నారు.

మంజీరానగర్ నూతన కమిటీ

అల్వాల్: అల్వాల్ మంజీరానగర్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు సోమవారం జరిగాయి. ఈ సందర్భంగా నూతన ఎగ్జిక్యూటివ్ కమిటీ ఏర్పడింది. అధ్యక్షులుగా వి.మహేందర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా ఇంద్రారెడ్డి, గిరిధర్‌రావు, రాజ్‌కుమార్, జయరావు, శ్రీనివాస్, తోట రామకృష్ణ, కృష్ణారెడ్డి, తోట శ్రీనివాస్, ప్రకాష్‌రావు ఉన్నారు.


నూతన కమిటీ సభ్యులు

అందరి సహకారంతో నేరాలకు చెక్

మల్కాజిగిరి: నేరాల అదుపునకు సహకరించాలని మల్కాజిగిరి ఇన్‌స్పెక్టర్ రవికుమార్ సూచించారు. హనుమాన్‌పేట్ నగర్ వెల్ఫేర్ అసోషియేషన్ సలహాదారుడు ఏవీస్వామి, సంయుక్త కార్యదర్శి దయాకర్ నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రవికుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాలనీలో సీసీ కెమెరాల ఏర్పాటు గురించి వారితో చర్చించారు. నేరాల అదుపునకు కాలనీ అసోషియేషన్ ప్రతినిధులు సహకరించాలని కోరారు. సెక్టార్ ఎస్ఐ వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

చెరువులోని వ్యర్థాలు తొలగిస్తాం

రామంతాపూర్: చిన్న చెరువులోని వ్యర్థాలతో వ్యాపిస్తున్న దుర్గంధాన్ని భరించలేకపోతున్నామని స్థానికుల ఫిర్యాదు మేరకు సోమవారం కార్పొరేటర్ బండారు శ్రీవాణివెంకట్రావు జీహెచ్ఎంసీ ఇరిగేషన్ ఈఈ పృథ్వితో కలిసి చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్న చెరువు భూగర్భంలో పేరుకుపోయిన వ్యర్థాలు, చెరువు వద్ద చెత్తను తొలగించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ఆమె తెలిపారు. బీజేపీ నేతలు తదితరులు ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

రామంతాపూర్: శ్రీరామకాలనీలోని మహంకాళి అమ్మవారి ఆలయ అభివృద్ధికి మాజీ కార్పొరేటర్ గంధం జ్యోత్స్న నాగేశ్వర్‌రావు రూ.లక్ష విరాళాన్ని సోమవారం అందజేశారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సభ్యులు, బీఆర్‌ఎస్ నేతలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సంకీర్తనలు

గౌతంనగర్: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని గౌతంనగర్ డివిజన్ పరిధిలోని ఇందిరానెహ్రూనగర్ బీహారి బస్తీలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కీర్తనలు ఆలపిస్తూ ప్రజలను పరవశింపజేశారు. బీహార్ మహిళా సంఘం అధ్యక్షురాలు మాధవి యాదవ్ బృందం పాల్గొన్నారు.

కుక్కలకు కు.ని. ఆపరేషన్లు

బోడుప్పల్: కుక్కలకు కు.ని. ఆపరేషన్లు నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు 5వ డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని భీంరెడ్డినగర్, ఐఐసిటీ కాలనీ, ఎన్ఐఎన్ కాలనీల్లో సంచరిస్తున్న వీధి కుక్కలను పట్టుకుని ఎనిమల్ కేర్ సెంటర్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుక్కలకు కు.ని. ఆపరేషన్లు చేసిన తర్వాత మళ్లీ ఇక్కడే వదిలిపెట్టనున్నట్లు తెలిపారు.

క్రీడల్లో యువత రాణించాలి

మల్లాపూర్: క్రీడల్లో యువత రాణించాలని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి సూచించారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మల్లాపూర్ శాంతి యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు చాందినీ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. దాదాపు 42 జట్లు పాల్గొన్నాయి. విన్నర్‌గా శాంతి యూత్‌క్లబ్ జట్టుకు రూ.15 వేల నగదుతో పాటు ట్రోఫీ, విన్నర్‌గా కళ్యాణ్ బాయ్స్ జట్టుకు రూ.5 వేల నగదు, ట్రోఫీని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, ఎస్సై శివకుమార్, పీఆర్. ప్రవీణ్, నెమలి అనిల్ అందజేశారు. కార్యక్రమంలో శాంతి యూత్‌క్లబ్ నిర్వాహకులు రాజేష్, రఘు, నాగరాజు, శ్రీనివాస్, శశి, శ్రవణ్ రెడ్డి, మేఘరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వారాంతపు సంత

మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని కాకతీయనగర్, మూడుగుళ్ల ప్రాంతాల్లో మంగళవారం తైబజార్ (వారాంతపు) సంత జరుగుతుంది.

వైద్య సేవలు

అల్వాల్, మల్కాజిగిరి, జవహర్‌నగర్, మౌలాలి ప్రభుత్వ ఆసుపత్రులలో మంగళవారం దంత పరీక్షలు, కంటి వైద్యం, జనరల్ చికిత్సలు నిర్వహిస్తారు.

అప్పుల ఊబిలో రాష్ట్రం

- ప్రజా సమస్యలను గాలికి వదిలేసిన వైనం
- బీఆర్‌ఎస్ పాలనకు స్వస్తి పలకాలి
- ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్



ఉప్పల్ కమాన్ వద్ద మాట్లాడుతున్న ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ తదితరులు


కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు

ఉప్పల్: అసమర్థ పాలనతో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని, కేంద్రం ఇచ్చిన నిధులను దుర్వినియోగం చేసిందని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. ఉప్పల్ కమాన్ వద్ద శక్తి కేంద్రం ఇన్‌చార్జిలు గొరిగె కృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రజాగోస– బీజేపీ భరోసా స్ట్రీట్ కార్నర్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నాలుగేళ్లుగా ఉప్పల్‌లో అభివృద్ధి కుంటుపడిందని ఎద్దేవా చేశారు. అసమర్థ పాలనతో రాష్ట్రం పూర్తిగా అప్పుల ఊబిలో కూరుకుపోయిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. ప్రజలు బీఆర్‌ఎస్ పాలనకు స్వస్తి పలకాలని కోరారు. మీసాల జంగయ్య, ఆకుల రుషికేష్, గుండె పునేందర్, దేవేందర్‌రెడ్డి, మహంకాళి లక్ష్మణ్, రావుల బాలకృష్ణ, యోచూరి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

డబుల్ ఇంజన్ సర్కారే లక్ష్యం..

రామంతాపూర్: కేసీఆర్‌నగర్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాగోస – బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్‌లో మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, కార్పొరేటర్ బండారు శ్రీవాణివెంకట్రావు పాల్గొన్నారు. సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్రంలో త్వరలోనే బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు. పలువురు బీజేపీ నేతలు పాల్గొన్నారు.

జోరుగా అభివృద్ధి పనులు..

మౌలాలి: డివిజన్ పరిధిలోని సుధానగర్ కాలనీలో శక్తి కేంద్రం ఇన్‌చార్జి గున్నాల చంద్రశేఖర్‌యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం ప్రజాగోస – బీజేపీ భరోసా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్పొరేటర్ గున్నాల సునీతశేఖర్‌యాదవ్ హాజరై కాలనీవాసులతో చర్చించారు. కాలనీలో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో సుధానగర్, మోడ్రన్ సుధానగర్, ద్వారకమాయి కాలనీవాసులు, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకులను నిలదీయండి

మల్లాపూర్: రోడ్లు, డ్రైనేజీ సమస్యలకు చెక్ పెడతామని, దోమల బెడద లేకుండా చేస్తామని, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చి మాట తప్పిన బీఆర్‌ఎస్ నాయకులను నిలదీయాలని మేడ్చల్ జిల్లా బీజేపీ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు రాగిరి మోహన్‌రెడ్డి, అంపాల పద్మారెడ్డి అన్నారు. నాచారం ఎర్రకుంటలో ప్రజాగోస– బీజేపీ భరోసాలో వారు పాల్గొన్నారు. రాష్ట్ర గిరిజన మోర్చా ప్రధాన కార్యదర్శి రవినాయక్, డివిజన్ అధ్యక్షులు ప్రకాష్, జిల్లా అధికార ప్రతినిధి గోపాల్‌గౌడ్, రవీందర్‌రావు, అనితారెడ్డి, ప్రధాన కార్యదర్శి నవీన్, చంద్రమౌళి, సాయిగౌడ్, శ్రీధర్‌రెడ్డి ఉన్నారు.

రాష్ట్రంలో అవినీతి పాలన

గౌతంనగర్: రాష్ట్రంలో అవినీతి పాలన కొనసాగుతోందని మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు, కార్పొరేటర్ రాజ్యలక్ష్మి అన్నారు. డివిజన్ పరిధిలోని వాణీనగర్ కాలనీలో బీజేపీ ప్రధాన కార్యదర్శి వాశెట్టి అనీల్‌గుప్త నివాసం వద్ద సోమవారం స్ట్రీట్ కార్నర్ సమావేశం నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ ఎనిమిదేళ్లుగా రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం నిరంకుశ, అవినీతి పాలన సాగుతోందన్నారు. నాయకులు ఎస్.శ్రీనివాస్ ముదిరాజ్, ధన్‌రాజ్, చందు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం


తాగునీటి సరఫరాను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కళ్యాణ్‌కుమార్

బోడుప్పల్: డివిజన్ పరిధిలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపినట్లు 12వ డివిజన్ కార్పొరేటర్ బొమ్మక్ కళ్యాణ్‌కుమార్ అన్నారు. అంబేడ్కర్ నగర కాలనీలో సోమవారం తాగునీటి సరఫరాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉండటంతో డివిజన్ ప్రజలతో కలిసి జలమండలి కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి సమస్యను పరిష్కరించుకున్నట్లు వెల్లడించారు. కాలనీ ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించినట్లు తెలిపారు. తన డివిజన్ పరిధిలో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకొస్తే వాటికి పరిష్కారం చూపుతామన్నారు. కార్యక్రమంలో జబ్బార్, యాకబ్, సత్యం, మురళి, కనకయ్య, నర్సింహ పాల్గొన్నారు.

వరకట్నం వేధింపులకు నవ వధువు ఆత్మహత్య


పావని(ఫైల్)

మల్లాపూర్: వరకట్నం తేవాలంటూ అత్తింటి వేధింపులకు ఓ నవ వధువు ఆత్మహత్య చేసుకున్న ఘటన నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ సారంగపాణి వివరాల ప్రకారం.. జనగాం జిల్లా లింగాల ఘనాపురం మండలం మాణిక్యపురం గ్రామానికి చెందిన చౌదరిపల్లి నర్సింహులు, వసంతల పెద్ద కుమార్తె పావని అలియాస్ నిత్య(20)ను జనగాం పట్టణం శ్రీనగర్‌కాలనీ చెందిన మరాఠీ నాగరాజు(30)తో 2022 డిసెంబర్ 18వ తేదీన వివాహం చేశారు. రూ.28 లక్షల కట్నం నిర్ణయించారు. నగదు, బంగారు ఆభరణాలతో కలిపి మొత్తం రూ.16 లక్షల వరకు ఇచ్చారు. ఈనెల 4వ తేదీన మల్లాపూర్ నాగలక్ష్మీనగర్ కాలనీలో వారు అద్దె ఇంట్లో ఉంటున్నారు. మిగిలిన వరకట్నం తేవాలని భర్త నాగరాజు, మామ యాదగిరి, మరిది మహేష్ ఆమెను వేధింపులకు గురిచేశారు. దీంతో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పావని తల్లి వసంత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలను పరిష్కరించాలి

కుషాయిగూడ: తమ కాలనీ సమస్యలకు పరిష్కారం చూపాలని కోరుతూ చర్లపల్లి డివిజన్ వీఎన్‌రెడ్డినగర్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డికి సోమవారం వినతి పత్రం అందజేశారు. కాలనీలో స్టామ్ వాటర్ లేన్, డ్రైనేజీ లేన్‌తో పాటుగా కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సహకారం అందజేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు కాలనీ అధ్యక్షుడు సప్పిడి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం ప్రతినిధులు లక్ష్మీనారాయణ, బుచ్చిరెడ్డి, రాంరెడ్డితో పాటు బీఆర్‌ఎస్ నేత డప్పు గిరిబాబు, రెడ్డినాయక్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న వీఎన్‌రెడ్డినగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మల్కాజిగిరి: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ వెంకట్‌రెడ్డి వివరాల ప్రకారం.. 29వ తేదీన అనుటెక్స్ మల్కాజిగిరి షాపింగ్ మాల్ వద్ద అపస్మారక స్థితిలో ఓ వ్యక్తి పడి ఉన్నాడని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు చికిత్స నిమిత్తం ఆ వ్యక్తి(55)ను చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న అతడు ఆదివారం మృతి చెందాడు. ఎవరైనా ఉంటే పోలీసులను సంప్రదించాలని పోలీసులు కోరారు.



ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

అల్వాల్: రోడ్డు భద్రత ప్రమాణాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలు పూర్తిస్థాయిలో నివారించవచ్చని ట్రాఫిక్ అసిస్టెంట్ ఏసీపీ జి.శంకర్ రావు అన్నారు. ట్రాఫిక్ అవగాహనలో భాగంగా బేగంపేట్ ట్రాఫిక్ పోలీస్ విభాగం అధికారులు సోమవారం కానాజీగూడలోని ఎస్సార్ డిజి పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని అన్నారు. ప్రిన్సిపల్ మంజులరెడ్డి, ట్రాఫిక్ అధికారులు అబ్దుల్ మజీద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'జాహ్నవి' స్నాతకోత్సవం


మెడల్స్, సర్టిఫికెట్లతో విద్యార్థులు

మేడిపల్లి: పీర్జాదిగూడ బోడుప్పల్‌లో సోమవారం జరిగిన జాహ్నవి విద్యా సంస్థల పీజీ విద్యార్థుల స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా ఓయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ యం.రాములు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో ముందువరుసలో నిలబడేలా పునాదులు వేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు మెడల్స్, పతకాలు, సర్టిఫికెట్లను అందజేశారు. చైర్మన్ ఎ.పరమేశ్వర్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఎ.లక్ష్మి, కాలేజీ ప్రిన్సిపాల్ శిల్ప, లెక్చరర్స్ పాల్గొన్నారు.